



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 146 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా మంగళవారం 7 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 146 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST TUE 7 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

## మధురై కోర్టు సంచలన తీర్పు

- సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు
- తొమ్మిది మంది పోలీసు అధికారులకు మరణ శిక్ష ఖరారు
- ఇది అత్యంత అరుదైన కేసు అని అభివర్ణించిన కోర్టు
- బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం
- 2020లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన ఇది

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని

మిగతా 2లో





## కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

### అమెరికా, ఇజ్రాయెల్‌కు సవాల్!

- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ కొత్త డ్రోన్
- 'హదీద్-110' పేరుతో స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్ తయారీ
- షాహెద్ కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణం
- గంటకు 510 కి.మీ వేగంతో 350 కి.మీ పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధంలో కొత్త దశకు సంకేతం

మిగతా 2లో

## ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది



- యాడికిలో 'జలధార' 100 రోజుల యాక్షన్ ప్లాన్ విడుదల
- అమరావతే ఏకైక రాజధాని.. పిచ్చి ముదిరి మావిగన్ అంటున్నారన్న సీఎం
- పెట్టుబడులను అడ్డుకుంటున్నారని వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు
- జలధారతో ప్రతీ ఎకరాకు నీరు ఇస్తామని హామీ
- పూర్వోదయతో సీమకు మహర్దశ ఖాయమని ధీమా

పెన్ పవర్ డెస్క్:'పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే, అందులో 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికితే, ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజధాని ఏదంటే 'అమరావతి' అని గర్వంగా చెప్పుకునే రోజు వచ్చిందని, గత పాలకులు ఆడిన మూడు ముక్కలాట ముగిసిందని అన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో సోమవారం జరిగిన 'జలధార..

మిగతా 2లో





## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

- ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
- గాలివానకు నేలరాలిన మామిడి, జీడి, అరటి, వరి పంటలు
- చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక
- ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం, రైతులకు మాత్రం తీరని నష్టం

పెన్ పవర్ డెస్క్:ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గత మూడు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినా, రైతులకు మాత్రం కన్నీళ్లను మిగిల్చింది. చేతికి అందివచ్చిన పంటలు నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి, బలమైన ఈదురు గాలులకు జనజీవనం స్తంభించింది.

మిగతా 2లో



## ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

### ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

- అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న దాడుల్లో పలువురు ఉన్నతాధికారుల మరణం
- దాడిని ధృవీకరించిన ఇరాన్ ప్రభుత్వం, ఐఆర్‌జీసీ
- ఈ ఘటనతో మరింత పెరగనున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు

మిగతా 2లో

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

- పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్
- ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి ప్రాముఖ్యతను వివరించిన పవన్
- యాత్రికుల సౌకర్యార్థం స్టేషన్‌లో అత్యాధునిక వసతుల కల్పన

మిగతా 2లో



## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

### శ్రీవారి అన్నదానంపై సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్టు

- తిరుమల నిత్యాన్నదాన పథకానికి 39 వసంతాలు పూర్తి
- 2 వేల మందితో మొదలై నేడు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం
- రూ.2,500 కోట్లు దాటిన శ్రీవారి అన్నప్రసాదం ట్రస్ట్ నిధులు
- దాతల సహకారం మరువలేనిదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీటీడీ పరిధిలోని 60 ఆలయాలకు పథకం విస్తరణ

మిగతా 2లో



## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- కేరళలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం
- సీఎం విజయన్ పై నిప్పులు చెరిగిన రాహుల్ గాంధీ
- ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని విమర్శ
- కేరళలో బీజేపీ, లెఫ్ట్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ
- మోదీని విమర్శిస్తే తనపై కేసులు, విజయన్‌పై ఎందుకు లేవని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విజయన్ ఏమీ దైవాంశ సంభూతుడు కాదని, ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని అన్నారు. త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన రాహుల్.. కేరళలో బీజేపీ, వామపక్షాల (ఎల్డీఎఫ్) మధ్య రహస్య అవగాహన ఉందని సంచలన ఆరోపణలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని

మిగతా 2లో

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కు పెట్టిన 'గన్'లా ఉంది



- జగన్ మావిగన్ కాన్సెప్ట్‌తో చంద్రబాబులో వణుకు మొదలైందన్న కన్నబాబు
- తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనేది జగన్ ఆలోచన అని కితాబు
- జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా
- ఏబీఎన్ రాధాకృష్ణ జగన్‌పై విషయం చిమ్ముతున్నారని మండిపాటు

మిగతా 2లో

## అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

- వైసీపీ ఒక రాజకీయ పార్టీ కాదు.. అదొక డ్రామా కంపెనీ అంటూ అనురాధ ఫైర్
- దోపిడీకి, అభివృద్ధికి మధ్య తేడా తెలుసుకోవాలని హితవు
- ప్రజలు తిరస్కరించినా వైసీపీ తీరు మారడం లేదని ఆగ్రహం
- లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం జగన్‌కు లేదని విమర్శలు

మిగతా 2లో





## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

### ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

- ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ తీరుకు ఇప్పటికే దేశం పలుమార్లు మూల్యం చెల్లించుకుంటోందన్న మోదీ
- జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకం మరో మైలురాయిని అధిగమించింది. 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన ఈ మహోన్నత కార్యక్రమం నేటితో 39 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం కేవలం 2 వేల మంది భక్తులతో మొదలైన ఈ సేవ, నేడు రోజుకు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం అందించే స్థాయికి చేరడం విశేషం. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల భాగస్వామ్యం, దాతల సహకారంతో శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ మూల నిధి రూ.2,500 కోట్లు దాటిందని తెలిపారు. ఈ పథకం స్ఫూర్తితోనే ప్రాణదానం, విద్యాదానం వంటి ట్రస్టులను ఏర్పాటు చేసి టీటీడీ ద్వారా వైద్య, విద్యా రంగాల్లో సేవలు అందిస్తున్నామని వివరించారు.

ప్రస్తుతం టీటీడీ పరిధిలోని మరో 60 దేవాలయాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ నిత్యాన్నదానం పథకాన్ని అమలు చేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిని వివరిస్తూ చంద్రబాబు సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను కూడా పంచుకున్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి చేయూతనిస్తున్న దాతలకు ఆయన అభినందనలు, నమస్కారాలు తెలియజేశారు.

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- మొదటి పేజి తరువాయి

విమర్శించినందుకు తనపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకున్నాయని, కానీ సీఎం విజయన్‌ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ ఎందుకు ప్రశ్నించడం లేదని రాహుల్ నిలదీశారు. ఈ పరిణామం బీజేపీ, లెఫ్ట్ నేతల మధ్య ఉన్న రాజకీయ ఒప్పందాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. కేరళ పర్యటనల్లో ప్రధాని మోదీ మతపరమైన అంశాలు మాట్లాడతారని, కానీ శబరిమల స్మగ్లింగ్ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. వామపక్షాలకు సహాయం చేసేందుకే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం విజయన్ ఫొటోలతో ఉన్న పోస్టర్లను ప్రస్తావిస్తూ, పాలన అంతా ఒక్కరే చేస్తున్నారనే అభిప్రాయాన్ని కల్పించడం రాజకీయ అహంకారమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ తరహా ఏకవ్యక్తి నాయకత్వం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మల పాలనలో కనిపిస్తుందని అన్నారు. కేరళలో పాలన సాగించేందుకు విజయన్ ఒక్కరే సమర్థుడని ప్రచారం చేసుకోవడం ప్రజలను అవమానించడమేనని రాహుల్ అన్నారు. వినయం, ప్రజల సానుభూతి ఉన్న ఎందరో నాయకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజాస్వామ్య నాయకత్వానికి అణకువ అవసరమని హితవు పలికారు. కేరళలో అసలైన పోరాటం యూడీఎఫ్‌కు, బీజేపీ–ఎల్‌డీఎఫ్ కూటమికి మధ్యేనని ఆయన స్పష్టం చేశారు.

## అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

వైసీపీ తీరు ఒక రాజకీయ పార్టీలా కాకుండా, ప్రజలను మభ్యపెట్టే 'డ్రామా కంపెనీ'లా తయారైందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి రాజధాని విషయంలో ఆ పార్టీ ఆడుతున్న నాటకాలు పరాకాష్ఠకు చేరాయని, 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు వ్యతిరేకంగా జగన్ చేస్తున్న కుట్రలు ఇకపై సాగవని ఆమె హెచ్చరించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ నేతల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.

### అసలు దోపిడీ అంటే ఏంటో తెలుసా?

అమరావతిలో దోపిడీ జరుగుతోందని జగన్ ఆరోపించడంపై అనురాధ తీవ్రంగా మండిపడ్డారు. "జగన్ గారూ.. అసలు దోపిడీకి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడా మీకు తెలుసా?" అని ఆమె ప్రశ్నించారు. అసలైన దోపిడీ అంటే ఏంటో వివరిస్తానంటూ ఆమె పలు ఉదాహరణలు ఇచ్చారు. "తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో పద్ధతిలో వేల కోట్లు సంపాదించడాన్ని దోపిడీ అంటారు. అక్రమ ఆస్తుల కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి బెయిల్ మీద తిరగడాన్ని దోపిడీ అంటారు. వెంకట నరసయ్య అనే చేనేత కార్మికుడిని ముగ్గు గనుల కోసం పొట్టనబెట్టుకోవడాన్ని, 'సాక్షి' మీడియాను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేయడాన్ని, భారతి సిమెంట్స్ కోసం నిబంధనలు ఉల్లంఘించడాన్ని దోపిడీ అంటారు" అంటూ నిప్పులు చెరిగారు.

### మద్యం, భూముల కుంభకోణాలపై విమర్శలు

"మద్యపాన నిషేధం అని చెప్పి, జే–బ్రాండ్ల మద్యాన్ని అమ్ముతూ డిజిటల్ చెల్లింపులు లేకుండా నెలకు రూ.100 కోట్లకు పైగా బ్లాక్ మనీని జేబులో వేసుకోవడాన్ని ఏమంటారు? ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తామని చెప్పి, విశాఖలో 41 వేల ఎకరాల భూములను కొట్టేయడాన్ని దోపిడీ అంటారు. పందికొక్కుల్లా ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేయడం, ఇసుకను బంగారం చేసి పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం వంటివన్నీ దోపిడీ కాదా?" అని అనురాధ ప్రశ్నించారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్‌లుగా నియమించి, స్వామివారి సొమ్మును కొల్లగొట్టిన పాపం మిమ్మల్ని వెంటాడుతోందని ఆమె వ్యాఖ్యానించారు.

### అభివృద్ధిని అడ్డుకుంటున్న కుట్రలు

అమరావతి అభివృద్ధిని ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే, వైసీపీ నేతలు మాత్రం బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అంతర్జాతీయ యూనివర్సిటీలు, ఐటీ కంపెనీలు వస్తుంటే అడ్డుకోవడం మీ అవివేకం కాదా? పదేళ్లయినా రాజధాని లేదని దేశమంతా జాలి పడుతుంటే, మీకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు" అని విమర్శించారు. రాజధానిని ఎలా దెబ్బతీయాలా అనే కుట్రతోనే వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారితో ప్రెస్ మీట్లు పెట్టించి విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

### లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

గతంలో ముఖ్యమంత్రిగా జగన్ ఎన్ని అబద్ధాలు ఆడారో, ఎన్ని యూ–టర్న్‌లు తీసుకున్నారో నారా లోకేశ్ వీడియో సాక్ష్యాలతో సహా బయటపెట్టారని అనురాధ గుర్తుచేశారు. "లోకేశ్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం మీకు ఉందా? అమరావతిపై అసెంబ్లీలో మాట్లాడిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న కుట్రలకు పొంతన లేదని ఆయన ట్వీట్ చేస్తే బదులివ్వలేకపోయారు" అని ఆమె అన్నారు. 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతుల గొప్పతనాన్ని ఓర్వలేకే ఈ కక్ష సాధింపు చర్యలని దుయ్యబట్టారు.

### ప్రజలు తిరస్కరించినా మారని వైఖరి

ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తిరస్కరించినా వైసీపీ తీరు మారలేదని అనురాధ విమర్శించారు. "పార్టీని ఎలా బాగు చేసుకోవాలో ఆలోచించకుండా, ఇంకా అమరావతిపై విషం చిమ్ముతున్నారు. మీ సైకో తత్వాన్ని పక్కనపెట్టి వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోండి. అభివృద్ధిని అడ్డుకున్న పాపం మిమ్మల్ని వదిలిపెట్టదు" అని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర రాజధానిపై విషం చిమ్మడం ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్రతి కుట్రకు తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆమె స్పష్టం చేశారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

- మొదటి పేజి తరువాయి

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.

కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్–19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి.

పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది

- మొదటి పేజి తరువాయి

నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతి పేరు పలకడానికి కూడా ఇష్టం లేని కొందరు పిచ్చి ముదిరి 'మావిగన్' అంటూ కొత్త పేరుతో పిలుస్తున్నారని, వారి ఫ్రస్టేషన్ చూస్తుంటే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు.

### రాష్ట్రానికి ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ

గత ప్రభుత్వ వైఖరిని దుయ్యబడుతూ, రాష్ట్రంపై పగ పట్టినట్లుగా వ్యవహరించారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే చూసి సహించలేక అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు" అని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని అమరావతేనని పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై సీమ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, సభకు హాజరైన ప్రజలు 'జై అమరావతి' నినాదాలతో తమ మద్దతు తెలిపారని గుర్తుచేశారు.

### పెట్టుబడులు వస్తుంటే ఓర్వలేకపోతున్నారు

గత పాలకులు రాష్ట్రంపై విద్వేషం చూపిస్తున్నారని, పెట్టుబడులు వస్తుంటే వారిని బెదిరించి తరిమేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. దేవాలయాలపై దాడులు చేసి, తిరుమల ప్రసాదం నాణ్యతను కల్తీ నెయ్యితో దెబ్బతీశారు. ఇలాంటి వారికి సహకరిస్తే ప్రజలందరికీ నష్టం జరుగుతుంది," అని హెచ్చరించారు. గత ప్రభుత్వం పెంచిన రూ.4,400 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని, తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు.

### జలధారతో ప్రతీ ఎకరాకు నీరు

అంతకుముందు, 'జలధార' కార్యక్రమం కింద 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను, 'నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత' యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. నీరే సంపద అని, దాన్ని పొదుపుగా వాడితేనే సంపద సృష్టించగలమని అన్నారు. "పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని జలాశయాల్లో నిల్వ చేయాలి. నీరు–చెట్టు, పంట కుంటలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి కార్యక్రమాలతో గతంలోనే నీటి సంరక్షణకు బాటలు వేశాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించి రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చాం. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం," అని వివరించారు.

### పూర్వోదయతో సీమకు మహర్దశ

రాయలసీమ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన 'పూర్వోదయ' పథకం ద్వారా రూ.30 వేల కోట్లు, పెట్టుబడుల ద్వారా మరో రూ.70 వేల కోట్లు సమీకరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. "గడిచిన 21 నెలల్లో చేపట్టిన జలసంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు 1.92 మీటర్ల మేర పెరిగాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 2.2 మీటర్ల పెరుగుదల కనిపించింది. 20 వేలకు పైగా ఎండిన బోర్లలో నీళ్లు వచ్చాయి. రూ.96 కోట్ల విద్యుత్ ఆదా అయ్యింది" అని తెలిపారు. శ్రీశైలం నుంచి ఎత్తిపోతల ద్వారా నీరు తెచ్చి, పట్టిసీమ నీటిని కృష్ణా డెల్టాకు ఇచ్చి, ఆదా చేసిన నీటిని సీమకు తరలించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ చేసిన కృషి ఫలించింది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిఠాపురం స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. కొద్ది నెలల క్రితం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను ఆయనకు సమగ్రంగా వివరించారు. పురాణ ప్రాధాన్యం ఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ నొక్కిచెప్పారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజానికి, పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో పిఠాపురంలో పర్యటించినప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో స్టేషన్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, దుర్గంధం వెదజల్లడం గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆనాడే స్టేషన్ రూపురేఖలు మార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు. పవన్ కల్యాణ్ అభ్యర్థన పట్ల కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో, ఇక పిఠాపురం స్టేషన్ సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. ఈ నిధులతో స్టేషన్ ప్రధాన భవనం, ముఖద్వారం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, కొత్త షెల్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గది, అత్యాధునిక టాయిలెట్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ పనులను కూడా పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. తాను అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కూడా పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ ఓ సరికొత్త స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్‌ను బయటికి తీసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్‌కు 'హదీద్–110' అని పేరు పెట్టారు. ఇది ఇప్పటికే యుద్ధరంగంలో వినియోగంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి రాడార్లకు చిక్కకుండా, వేగంగా దూసుకెళ్లి లక్ష్యాలను ధ్వంసం చేసేలా దీన్ని రూపొందించినట్లు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోలో వెల్లడించింది. ఈ కొత్త డ్రోన్ ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది సూసైడ్ డ్రోన్ తరహాలో పనిచేస్తుంది. అంటే, లక్ష్యాన్ని చేరుకుని, తనను తాను పేల్చుకుని విధ్వంసం సృష్టిస్తుంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు, కమాండ్ సెంటర్లు, కీలకమైన మౌలిక సదుపాయాలే దీని ప్రధాన లక్ష్యాలు. ఇరాన్ ఇప్పటివరకు వినియోగిస్తున్న షాహెద్–136 డ్రోన్‌తో పోలిస్తే, హదీద్–110 దాదాపు మూడు రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. ఇది గంటకు సుమారు 510 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. హదీద్–110 డ్రోన్‌లో 30 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను (హై ఎక్స్‌ప్లోసివ్ వార్‌హెడ్) అమర్చవచ్చు. దీని పరిధి సుమారు 350 కిలోమీటర్లు కాగా, దాదాపు గంటపాటు గాలిలో ఎగరగలదు. కాంపాక్ట్ జెట్ ఇంజిన్‌తో పనిచేసే ఈ డ్రోన్, డెల్టా–వింగ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఈ ప్రత్యేక ఆకృతి వల్లే రాడార్ సిగ్నల్స్‌కు సులభంగా చిక్కకుండా (తక్కువ రాడార్ క్రాస్–సెక్షన్) స్టెల్త్ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. దీన్ని నేరుగా కాటపల్ట్ ద్వారా గాల్లోకి ప్రయోగించి, ఆ తర్వాత జెట్ ఇంజిన్‌ను స్టార్ట్ చేసి ముందుకు పంపిస్తారు. ఇప్పటికే ఈ డ్రోన్‌ను ఉపయోగించి అమెరికా సైనిక స్థావరాలు లేదా సంబంధిత లక్ష్యాలపై తొలి దాడులు జరిగాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. షాహెద్ వంటి నెమ్మదైన డ్రోన్లను ఎదుర్కోవడానికి అలవాటుపడిన అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల రక్షణ వ్యవస్థలకు ఈ వేగవంతమైన స్టెల్త్ డ్రోన్ కొత్త సవాలుగా మారింది. హదీద్–110 రాకతో మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధ తంత్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇది ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా ఉంది

వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' కాన్సెప్ట్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబులో వణుకు మొదలైందని మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. విశాఖపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనే జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా చేశారు. అమరావతి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం... మరోవైపు రాష్ట్రంలో జీతాలకు కూడా డబ్బులు లేవని ఆర్థిక మంత్రి ద్వారా చెప్పించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిపై చంద్రబాబు చేస్తున్న ఖర్చు కేవలం అవినీతి కోసమేనని, జగన్ ప్రతిపాదన ఆ అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అమరావతిని 'కమ్మరావతి' అని సంబోధించినా కూటమి నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన రాతల ద్వారా జగన్‌పై విషం చిమ్ముతున్నారని, జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనే భయమే వారిని ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పురిగొల్పుతోందని కన్నబాబు వ్యాఖ్యానించారు.

# ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించింది.

## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

- మొదటి పేజి తరువాయి

జంగారెడ్డిగూడెం సమీపంలోని వేగవరం ప్రధాన రహదారిపై ఓ భారీ వృక్షం విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలివాన ధాటికి మామిడి, జీడి తోటల్లో కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. మరో నెల రోజుల్లో కోత కోసి మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి పంట కళ్ల ముందే దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మామిడితో పాటు కోతకు సిద్ధంగా ఉన్న వరి, అరటి, జీడిమామిడి వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా నష్టపోయాయని రైతులు వాపోతున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించిన పంట ఇలా అకాల వర్షానికి నాశనం కావడం తమను ఆర్థికంగా కుంగదీసిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు పంట నష్టంపై అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక పంపిన తర్వాత రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.

# పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాకిస్థాన్ సోషల్ మీడియా సమాచారం ఆధారంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ భారత ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపించారు. అసోంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాకిస్థాన్ పాటనే పాడిందని మండిపడ్డారు. ఈ సంబంధం ఎప్పటి నుంచో సాగుతోందని అన్నారు. జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇటీవల రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వారు పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్లు గుర్తించామని ఆరోపించారు. నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ ఢిల్లీలో, గౌహతిలో రెండు మీడియా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా వారు మాట్లాడిన సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి తీసుకున్నదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలో ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలు నిర్వహించిందని, ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఈ ప్రతి టాక్ షోలోనూ కాంగ్రెస్ గెలవాలని పాకిస్థాన్ మీడియా కోరుకుందని వెల్లడించారు.

### కాంగ్రెస్ ఆరోపణలపై ముఖ్యమంత్రి ఆగ్రహం

హిమంత బిశ్వశర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీనితో పాటు ఆమె ఆస్తులను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల సమయంలో కావాలని ఇలాంటి ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇందుకు కాంగ్రెస్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలకు గాను తన భార్య కేసు పెట్టినట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

## శ్రీ బాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవమునకు ఏర్పాట్లు

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 6**:గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట లో వేయించేసియున్న శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 12వ కళ్యాణ మహోత్సవము ఈనెల 12వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయం కమిటీ తెలియజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ ఆదివారం నుండి 14వ తేదీ మంగళవారం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించబడును ఈ కార్యక్రమం తలకించేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రైతులు వినియోగదారులు భద్రతే లక్ష్యంగా రైతు బజార్ లు

**– జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** సరసమైన ధరలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే లక్ష్యంతో రైతు బజార్లు ఆవిర్భవించాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.
స్థానిక రైతు బజార్ వద్ద సరిహద్దు గోడ నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు సోమవారం రైతు బజార్ అభివృద్ధి పనులపై ఆయన మున్సిపల్ కమి షనర్ మార్కెటింగ్ దేవా లయ ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజా రులో వినియోగదారుల సౌకర్యార్థం భద్రత దృష్ట్యా ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు దీనిలో భాగంగా మార్కెట్ ప్రాంగణంలో భద్రతా చర్యలను పెంచు తున్నామన్నారు. సుమారు 51 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. రైతులు వినియోగదారులు భద్రతే లక్ష్యంగా ఈ యొక్క అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు రైతు, వినియోగదారుల మధ్య మధ్యవర్తులు లేకుండా నేరుగా, సరసమైన ధరలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే లక్ష్యంతో రైతు బజార్లు ఆవిర్భవించాయన్నారు. రైతు వారి ఉత్ప త్తులకు గిట్టుబాటు ధర లభించేలా దళారీ మధ్యవర్తి వ్యవ స్థను తగ్గించడం ఈ బజార్ల ముఖ్య ఉద్దేశం అన్నారు. తాజా, నాణ్యమైన కాయగూరలు, పండ్లు, కొన్ని పప్పులు, నూనెలు వంటివి సాధారణ మార్కెట్ల కంటే తక్కువ ధరలో లభిస్తాయన్నారు. రైతుల ఆదాయం, పౌరుల ఆరో గ్యం ఇరువైపు ప్రయో జనాలు సాధించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కే విశాలాక్షి, స్థానిక మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి సత్యనారాయణ తదిత రులు పాల్గొన్నారు.




## ద్వారపూడిలో నీటి భద్రత - సాగు నీటి సంఘాల బాధ్యత



**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ**

**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 6:**రాష్ట్ర ప్రభుత్వం నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో చేపట్టిన నీటి సంరక్షణ కార్యక్రమాన్ని మండలంలోని ద్వారపూడిలో పంగిడి చెరువు వద్ద రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సోమవారం రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణ – జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని చేపడతామని ఎమ్మెల్యే అన్నారు. నీటి భద్రత అనేది ప్రభుత్వ బాధ్యతే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలన్నారు. దీనికి సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతీ చుక్కనూ ఒడిసి పట్టుకుని భూగర్భ జలాలను పెంచాల్సిన భాధ్యత అందిరిపై ఉందన్నారు. నేటి నుంచి ఏప్రిల్ 15 వరకు పనుల గుర్తింపు కార్యక్రమం, ఏప్రిల్ 16 నుంచి 20 వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు, ఏప్రిల్ 21 నుంచి జులై 9 వరకు పనులను చేపట్టుట, జులై 10 నుంచి 14 జులై మధ్య పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఏప్రియల్ 06:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడులో భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక బిజెపి కార్యాలయంలో ప్రత్తిపాడు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఊట వీరబాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ఇంటిపై జెండా ఎగరవేయడమే కాకుండా, గ్రామ గ్రామాన భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సింగిలీదేవి సత్తిరాజు, మండల ఉపాధ్యక్షురాలు సింగిడి లక్ష్మి, అప్పారావు, శిరసాల సుబ్రహ్మణ్యం, కర్రీ సత్తిబాబు ,పచ్చిపులుసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యత పై సమావేశం

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 6:**మండల కేంద్రమైన గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం నీటి భద్రత, సాగు నీటి సంఘాల భాద్యత కార్యక్రమం లో భాగంగా నీటి సంఘాల అధ్యక్షులు మరియు సంబందించిన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సూచనలు మేరకు 100 రోజుల ప్రణాళిక తయారు చేయుటకు తీసుకొ వలసిన చర్యలు పై చర్చించడమైనది. ఈ కార్యక్రమం లో ఎంపీపీ శ్రీ చెలగళ్ల పద్మనాభు డు (దొరబాబు ), పుష్కర ప్రాజెక్ట్ చైర్మన్ శ్రీ అడబాల భాస్కరరావు , వివిధ గ్రామాల నీటి సంఘాల అధ్యక్షులు, ఎంపీడీఓ గారు, ఇరిగేషన్ ఏ ఈ గారు సంబందించిన శాఖల అధికారులు పాల్గున్నారు



## నియోజకవర్గ అభివృద్ధిపై సానుకూలంగా స్పందించిన నారా లోకేష్.

**–ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభారాజా.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,ఏప్రియల్ 06:** ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి విద్య, ఐటీ తోపాటు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే ఓరుపుల సత్యప్రభారాజా తెలిపారు. విజయవాడ, ఉండవల్లిలోని వారి నివాసంలో నారా లోకేష్ ను ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల గురించి చర్చించారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యా వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ వంటి కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటికి తక్షణ పరిష్కారాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఓరుపుల సత్య ప్రభ రాజా నారా లోకేష్ ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, తగిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని మీడియాకు తెలియజేశారు.



01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# ప్రజా దర్బార్‌లో సమస్యలకు తక్షణ పరిష్కారం





**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 6:**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమం విశేష స్పందన పొందింది. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను నేరుగా మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగ పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కోసం మొత్తం 80 వినతిపత్రాలు అందాయి. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం తన ప్రాథమిక బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు నమ్మకాన్ని కలిగించే వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఇతర నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# బాలలపై దాడులకు పాల్పడితే సహించేది లేదు

**బాలల హక్కుల కమిషన్ సభ్యుడు మందాల గంగా సూర్యనారాయణ**



**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 6:**బాలలపై హింసాత్మక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు మందాల గంగా సూర్యనారాయణ హెచ్చరించారు. పత్రికల్లో వెలువడిన "ఊచతో కొట్టి... వాతలు పెట్టి" అనే ఘటనపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులతో కలిసి గాయపడిన బాలుడిని పరామర్శించారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావులతో కలిసి కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సర్జికల్ విభాగం ఆర్ ఐ సి యు-1లో చికిత్స పొందుతున్న 8 ఏళ్ల పెండ్యాల నిహాల్‌ను సందర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ పరిస్థితులపై వివరాలు సేకరించారు.వివరాల ప్రకారం, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం నమ్మంగి గ్రామానికి చెందిన నిహాల్ తన తండ్రి చంద్రయ్యతో కలిసి జీవిస్తున్నాడు. తల్లి చిన్నప్పుడే మృతి చెందడంతో తండ్రే బాలుడిని పెంచుతున్నాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న నిహాల్, ఇటీవల పక్కింటి ఆటో సీటు కవర్ చింపివేశాడని ఆరోపణలతో తండ్రి వద్దకు ఫిర్యాదు చేరింది.దీనిపై మద్యం మత్తులో ఉన్న తండ్రి చంద్రయ్య విచక్షణ కోల్పోయి బాలుడిని ఇనుప చువ్వతో కొట్టి, వేడి వస్తువుతో వాతలు పెట్టినట్టు సమాచారం. తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయిన బాలుడిని పొరుగువారు గుర్తించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నంబర్ 67/2026, తేదీ 04.04.2026, సెక్షన్ 118(1) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేయబడింది. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ, "ఆపదలో ఉన్న బాలల రక్షణలో ప్రభుత్వం ముందుంటుంది. నిహాల్ చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. సమాజం కూడా ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండించాలి" అని అన్నారు. ప్రభుత్వం, శాఖ తరపున బాలుడికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ, బాలుడి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని, ఇంకా వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిపారు. బాలుడి ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అతని సంరక్షణ బాధ్యతలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి చెందిన ప్రొటెక్షన్ ఆఫీసర్లు కె. శ్రీనివాసరావు, జె. విజయ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 396 అర్జీలు

- ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి అవసరం
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్





**కాకినాడ పెన్ పవర్, ఏప్రిల్ 6:**జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో జేసీ అపూర్వ భరత్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీ. త్రినాథ్, డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసు, డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 396 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ సత్వరమే సమగ్ర విచారణ చేసి తగిన పరిష్కారం అందించాలని జేసీ ఆదేశించారు. బియ్యం కార్డులు మంజూరు, కార్డులలో పేర్ల మార్పులు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీ పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు.పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీపై అధికారులు ప్రాధాన్యతతో స్పందించి, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలన్నారు. రీ-ఓపెన్ చేసిన అర్జీలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి తగిన సమాధానాలు ఇవ్వాలని సూచించారు. అలాగే,శాఖల వారీగా పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు జేసీ ఆదేశించారు.

## వాడపల్లి వెంకన్న నిత్య అన్నదానానికి భక్తులు విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 6:**ఏడు వారాల వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకున్నారు. సోమవారం ఆలయ సన్నిధిలో పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిత్య అన్నదాన పథకానికి కిఆలమూరు గ్రామానికి చెందిన రామచంద్ర మూర్తి--నాగమణి దంపతులు రూ.1,00,000 విరాళంగా సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉపకమేస్తారు నల్ల సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## ప్రతి ఇంటిపైనా భారతీయ జనతా పార్టీ జెండా ఎగరాలి

- 47 వ బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో శరకణం రాజబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 06:** ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ఇంటిపైనా బిజెపి జెండా ఎగరడమే కాకుండా,గ్రామ గ్రామాన భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు పిలుపునిచ్చారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో సీనియర్ బిజెపి నాయకుడు,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో,జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ,జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ పర్యవేక్షణలో బిజెపి సీనియర్ నాయకులు,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు అల్లు శివరామకృష్ణ ఆధ్వర్యంలో,నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేద ప్రజలకు మోడీ అందించిన పథకాలను వివరించారు. ప్రత్యక్ష, పరోక్ష రాజకీయాలను కూడా ప్రజలు మాట్లాడుకునే దిశ గా ఉన్నాయంటే మోడీ చలవే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు,మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ,మండల కార్యదర్శిలు భీమనాధులు వీరబాబు,ఆడారి రామచంద్రరావు,మండల ఉపాధ్యక్షులు బుద్ధ సత్యనారాయణ,బిజెపి నాయకులు గోలి సుబ్బారావు, అరటా పెద్ద పోలీస్, బాలిమ్ రామకృష్ణ, అప్పారావు,వానపల్లి గంగాధర్,పలికిల సత్యనారాయణ, బొడ్డేటి చిన్నబ్బాయి,పప్పుల రాంబాబు, బొడ్డేటి బాబురావు,రాపేటి కోటేశ్వరరావు,నైదాన రవి, పిట్ట లోవ,కడియాల చిన్న, పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటి వనరుల పరిరక్షణకు బలమైన పునాది

**రైతులు సమన్వయంతో పని చేయాలి ఎమ్మెల్యే బండారు**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 6:**నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సోమవారం లొల్ల లాకుల వద్ద జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా కాటన్ దొర విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయతీరాజ్, అటవీ, పశుసంవర్ధక శాఖలు కలిసి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాయని తెలిపారు.

వంద రోజుల కార్యాచరణను నాలుగు దశల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో పనుల గుర్తింపు, అనుమతులు, అమలు, నివేదికల సమర్పణ వంటి దశలు ఉంటాయని చెప్పారు. చెరువులు, కాల్వలు శుభ్రపరచడం, పూడికలు తొలగించడం, చెక్‌డ్యాంల మరమ్మతులు, ఫీడర్ ఛానెల్స్ క్లియర్ చేయడం వంటి పనులు చేపడతామని వివరించారు.

## సత్రం భూములపై అక్రమ వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి శ్రీ పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మాదాయ దేవాదాయ శాఖకు సంబంధించిన సుమారు 150 ఎకరాల సత్రం భూములపై అక్రమ వసూలు చేస్తున్న పందిరి ఆనంద్ పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ శ్రీ పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మాదాయ దేవాదాయ శాఖకు సంబంధించి భూమి జగ్గంపేటలో కలదు. ఆ భూమిని 25 సంవత్సరాల నుంచి జగ్గంపేట, గుర్రప్పాలెం, రామవరం, గోనేడ, సోమరాయునిపేట గ్రామాలకు చెందిన భూమిలేని నిరుపేదలు శిస్తులు కట్టి జీవనం సాగిస్తున్నారని, ఆ భూమికి పట్టా పాసుబుక్కులు ఇప్పిస్తామని ఎంవి ప్రసాద్ వర్గానికి చెందిన పందిరి ఆనంద్ అనే వ్యక్తి మరియు వారి వర్గం అమాయక ప్రజలు ఒక్కొక్కరు వద్ద నుంచి 15వేలు రూపాయలు అడ్వాన్స్ గా వసూలు చేస్తున్నారని, పట్టాలు వచ్చిన తర్వాత మరొక 15 వేల రూపాయలు ఇవ్వాలని ఇవ్వకపోతే ఆ భూమిలోంచి మీ వాటా తీసేస్తామని, భయభ్రాంతులకు గురిచేసి సుమారు 65 లక్షల రూపాయలు ప్రస్తుతానికి వసూలు చేశారని , ఆ వసూళ్లను, బెదిరింపులను వెంటనే ఆపాలని, వసూలు చేసిన సొమ్మును పేద ప్రజలకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ మరియు ఎండోమెంట్ అధికారులు స్పందించి సత్రం భూములు చేసుకుంటున్న పేదల వద్ద నుంచి పట్టా పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని వసూలు చేస్తున్న సొమ్మును రికవరీ చేసి పేద ప్రజలకే తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పి డి యస్ యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కే సతీష్, జిల్లా నాయకులు కే. రామలింగేశ్వర రావు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధరతో పాటు వేగవంతమైన చెల్లింపులు

**రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 6** :వ్యవసాయమే రాష్ట్రానికి వెన్నెముక అని బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం ఆత్రేయపురంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో కలిసి రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి వ్యవసాయంపై ఆధారపడి ఉందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆత్రేయపురంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతం పరిశీలించి కొనుగోలు విధానాన్ని పరిశీలించారు.

రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, అవసరమైన గోతాలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చెల్లిస్తామని తెలిపారు.గత ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన కొన్ని గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోందని చెప్పారు. నరేంద్ర మోదీ, ఎన్ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలోఆకుల రామకృష్ణ,మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు (బాబు) తోట రజిని ముదునూరి వెంకటరాజు, కంఠం శెట్టి శ్రీనివాస్ ,ముళ్ళపూడి భాస్కరరావు, పేర్చర్ల పుల్లం రాజు వర్మ అధికారులు,, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగ్గులతో మద్దతు అమరావతికి మహిళల అభినందనలు




**కొత్తపేట,పెన్ పవర్,ఏప్రిల్6:**అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన కూటమి ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.ఆంధ్రుల దీర్ఘకాలిక ఆకాంక్ష నెరవేరడంతో ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.జై అమరావతి అంటూ ర్యాలీలు నిర్వహిస్తూ,జ్యోతులు వెలిగిస్తూ తమ మద్దతును వ్యక్తపరుస్తున్నారు.ముఖ్యంగా మహిళలు ఇంటి ముందర ముగ్గులు వేసి ప్రత్యేకంగా తమ అభిమానం చాటుతున్నారు.గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనపై ప్రజలు గట్టిగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే.ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన ప్రస్తుత ప్రభుత్వం అమరావతిని శాశ్వత రాజధానిగా నిలిపింది. ఈ సందర్భంగా కొత్తపేటకు చెందిన సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిని,వర్ధిని జై అమరావతి ముగ్గులు వేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.వారు వేసిన ముగ్గును ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు పంపి అభినందనలు తెలిపారు.

# జగ్గంపేట-ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మధ్య ఎంఓయు



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మధ్య విద్యా పరమైన పరస్పర సహకారం మరియు విద్యార్థుల అకాడెమిక్ ప్రగతిని మెరుగుపరచడం లక్ష్యంగా అవగాహన ఒప్పందం (ఎంఓయు) సోమవారం కుదిరింది. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చెన్నారావు, ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీత ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా రెండు కళాశాలల మధ్య అధ్యాపకుల పరస్పర మార్పిడి, విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, సదస్సులు, వర్క్ షాపులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉత్తమ బోధనా పద్ధతుల పంచుకోలు వంటి అంశాలను అమలు చేయనున్నారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరియు ఫలితాలను మెరుగుపరచడానికి సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రెండు కళాశాలల అధ్యాపకులు, విభాగాధిపతులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు మెరుగైన అకాడెమిక్ సహాయం లభించి, వారి ప్రదర్శన మరింత మెరుగుపడుతుందని ప్రిన్సిపాల్స్ తెలిపారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏఎంసి చైర్మన్ పల్లి మంగాదేవికి ఎంపీ హరీష్ మాధుర్ అభినందనలు



**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 6:** రావులపాలెంలో ఇటీవల నిర్వహించిన కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (ఏఎంసి) ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కారణంగా హాజరు కాలేకపోయారు.

అయితే, సోమవారం ఆయన వానపల్లి గ్రామానికి విచ్చేసి పల్లి భీమారావు స్వగృహంలో ఏఎంసి చైర్మన్ పల్లి మంగాదేవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పల్లి భీమారావు,మంగాదేవి దంపతులను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కొత్తపేట ప్రాంత అభివృద్ధికి మార్కెట్ కమిటీ కీలక పాత్ర పోషించాలని, రైతులకు మరింత సేవలందించాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్‌తో పాటు టిడిపి నాయకులు పోలబత్తుల సుబ్రహ్మణ్యం,గనిశెట్టి వీరేష్,నూకల వీరన్న,సిద్ధబత్తుల బహుదూర్,అప్పారి శ్రీను,అంబటి సాగర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## క్రైస్తవుల మనోభావాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాలదే.

-ఏసుక్రీస్తు పునరుత్థాన దినోత్సవ మహోత్సవంలో మురళీకృష్ణంరాజు.





**కిర్లంపూడి/పెన్ పవర్, ఏప్రియల్ 06**:క్రైస్తవుల మనోభావాలు దెబ్బ తినకుండా కాపాడవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో క్రీస్తు దేవాలయం పాస్టర్ రెవ బి జోసెఫ్ ఆధ్వర్యంలో 19వ వార్షిక క్రీస్తు పునరుత్థాన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మురళీకృష్ణంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో క్రైస్తవులు అనేక ఇబ్బందులు పడడమే కాకుండా, క్రైస్తవులు మనోవేదనకు గురవుతున్నా రన్నారు. క్రైస్తవులు మనోభావాలు దెబ్బ తినకుండా కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అన్ని మతాలను గౌరవించవలసిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానవ విలువలు, దేవుని విశిష్టత గురించి విపులంగా వివరించిన దైవజనులను మురళీకృష్ణంరాజు అభినందించారు. ఈ మహోత్సవ సభ నిర్వహణకు 25,000 రూపాయలు విరాళాన్ని నిర్వాహకులకు మురళీకృష్ణంరాజు చేతులమీదుగా అందజేస్తారు. ఈకార్యక్రమంలో విశాఖపట్నం-బెరాక అపోస్టోలిక్ చర్చి పాస్టర్ టి. జెఫన్యా శాస్త్రీ,దివిసీమ కోడూరు-అంతర్జాతీయ సువార్త గాయకులు, సేవకులు పాస్టర్. శిరివెళ్ల హనోకు తోపాటు జిల్లా అడ్వెంజర్ పాస్టర్ రెవ.సి.హెచ్ అబ్రహాం సామ్యూల్,రెవ.డా.. మాసా.ఇమ్మానుయేలు ,పాస్టర్.ఎ.దైవప్రసాద్,రెడ్డి ,రెవ.గుడాల.ప్రభాకర్,రెవ.ఎమ్.మత్త యి,రెవ.డి.రాజుబాబు,బ్రదర్.జి.సుందర్రావు,రెవ॥ జిల్లా అడ్వెంజర్ కమిటీ వల్లూరి రత్నం,మండల అడ్వెంజర్ ఏబిసిడి ప్రసాద్, మాజీ అధ్యక్షులు ఓకసీమ ,తాటిపర్తి పాస్టర్ జి ప్రేమానంద్,సిహెచ్ జోషావా ,పలువురు పత్తిపాడు నియోజకవర్గ పాస్టర్లు,బొల్లునాగేశ్వరరావు,క్రీస్తు దేవాలయం యూత్ సభ్యులు, ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల ఉల్లంఘన -- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

ఏ.పి. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డా. నాగ మానస



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:**అంబాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బాలల హక్కుల ఉల్లంఘన -- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు అంబాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సిహెచ్ మణికంఠ గోతులు తీసే పనిలో పాల్గొనాల్సిందిగా ఆ క్రమంలోనే గుణపం తగిలి మధ్య వేలు తీవ్రంగా గాయపడిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం బాలుడు అనిల్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డా. నాగ మానస ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు.

ఈ సందర్భంగా బాలుడితో ఎవరు ఈ పనులు చేయించారు? ఎందుకు చేయించారు?" అనే అంశాలపై లోతుగా విచారణ చేపట్టారు.

విచారణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడింది. బాలుడిని ప్రమాదకరమైన పనుల్లో పాల్గొనేటట్లు ప్రేరేపించడం ద్వారా బాలల భద్రత పట్ల ఘోరమైన నిర్లక్ష్యం ప్రదర్శించినట్టు తేట తెల్లమైంది. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు బాధ్యతాయుతంగా వ్యవహరించక పోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

పాఠశాల పరిధిలో బాలల చేత ఇలాంటి పనులు చేయించడం చట్ట విరుద్ధమని, ఇది బాలల హక్కులపై ప్రత్యక్షదాడి అని కమిషన్ సభ్యురాలు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక తయారు చేసి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు.

పాఠశాలలు విద్యకు మాత్రమే పరిమితం కావాలి -- బాలల ప్రాణాలతో చెలగాటం అనుమతించబడదుఅని నాగ మానస గారు స్పష్టంగా హెచ్చరించారు.

## చేనేత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం...



**అంబాజీపేట, ఎన్ పవర్, ఏప్రిల్ 6:**చేనేతలకు ఆసరాగా ప్రభుత్వం చేనేత కుటుంబ మగ్గాలకు ఉచితంగా విద్యుత్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కోకన్వీనర్ దాసరి వివి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కె. పెదపూడి గ్రామం లో చేనేత కార్మికుల ప్రతి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందస్తున్న ఉచిత విద్యుత్ పథకం కరపత్రాలు అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు ప్రవేశపెట్టిన చేనేతలకు ఆసరాగా కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబ మగ్గాలకు 200 యూనిట్లు వరకు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీగా ప్రవేశపెట్టారని అన్నారు. గ్రామం లో ప్రతి చేనేతకార్మికుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రీ మ్యాన్ కమిటీ సభ్యులు పెచ్చెట్టి హరిబాబు, ఎన్డీఏ కూటమి నాయకులు నేదునూరి పెద్దిరాజు. మంద రాజేష్. మోకా శ్రీను. బల్ల బసవరాజు. కొండ బాలాజీ. చింతా భాస్కర్ రావు. ఉప్పు సీతయ్య. పిచ్చుక వినాయక రావు తదితరులు పాల్గొన్నారు.

### యుటిఎఫ్ ఆధ్వర్యంలో ...

## పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ కు ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 6:** యుటిఎఫ్ ఏలేశ్వరం మండల శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ కు ఉచిత కోచింగ్ సెంటర్ ను సోమవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ హోమ్ నందు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జెట్ల సోమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉచిత కోచింగ్ సెంటర్ ను లాంఛనంగా ప్రారంభించారు. ముందస్తుగా ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో ఇప్పటివరకు 50 మంది విద్యార్థులు కోచింగ్ సెంటర్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని విద్యార్థులకు హాజరు కావడం జరిగిందని సోమరాజు వెల్లడించారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య పట్ల అవగాహన కల్పించడంతోపాటు, ఎంట్రన్స్ టెస్ట్ కు ఏ విధంగా విద్యార్థులు ప్రిపేర్ కావాలో తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తో పాటు ప్రతిరోజు కోచింగ్ లో శిక్షణ ఇవ్వబడిన ఇవ్వబడిన అంశాలపై మోడల్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి , జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ , జిల్లా అధ్యక్షులు సూరిబాబు , జిల్లా గౌరవ అధ్యక్షులు సాయిరాం, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, ఎం ఈ ఓ బి.అబ్బాయి , మండల ప్రధాన కార్యదర్శి కె.రవి , సీనియర్ నాయకులు మెతకాని రాంబాబు, గణపతి రావు, ఏ బి వి ప్రసాద్ , మూర్తి , విశ్వనాథ్ , రాజశేఖర్ , మండల సెక్రటేరియట్ సభ్యులు పాల్గొన్నారు.ం

## జగ్గంపేట అన్నా క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ వారం దాత పెద్దాపురం వాస్తవ్యులు స్వర్గీయ పిల్ల సూరిబాబు జ్ఞాపకార్థం జగ్గంపేటకు చెందిన వారి అల్లుడు కుమార్తె జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, జగ్గంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, పద్మావతి దంపతుల ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాలిశెట్టి సతీష్, సూరపరెడ్డి నరేష్, వేములకొండ జోగారావు, పిలా మహేష్, లోకనాథ మంజు, కళ్యాణి, సుజిని తదితరులు పాల్గొన్నారు,

## వరుపుల దుర్గావేణిని కలిసిన బర్లపూడి క్రాంతి.




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 6:** మండల పరిధి లింగంపర్తి గ్రామంలో జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు నివాసానికి జనసేన మహిళా నాయకురాలు బర్లపూడి క్రాంతి విచ్చేసి తమ్మయ్య బాబు సతీమణి జనసేన పార్టీ నాయకురాలు దుర్గవేణిని కుమారుడు సాయికిరణ్ లను సోమవారం మర్యాదపురం కలిశారు. వరుకుల కుటుంబంలో తమయ్యాబాబు లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. ఆ కుటుంబం పై నియోజకవర్గ జనసేన పార్టీ కార్యకర్తలకు అపారమైన సానుభూతి ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళ రిజర్వేషన్ బిల్లుకు సానుకూలంగా ఉండడంతో మహిళలకు చట్ట సభల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. ఇదిలా ఉంటే దుర్గవేణి, క్రాంతి సుమారు రెండు గంటలసేపు మాట్లాడుకుని అక్కడికి చేరుకున్న జనసేన నాయకులను కార్యకర్తలను అభిమానులను జనసైనికులను పలకరించి మాట్లాడారు. పార్టీ కార్యకర్తల్లో వరుపుల తమ్మయ్య బాబు భార్య దుర్గా వేణికి రానున్న ఎన్నికల్లో అవకాశం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇస్తుందని కార్యకర్తల్లో చర్చ మొదలైంది. అయితే బర్లపూడి క్రాంతి తమ్మయ్య బాబు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుని పరామర్శించి ఓదార్చేందుకే వచ్చారు. కుటుంబ సభ్యులతో క్రాంతి మాట్లాడి అనంతరం తమ్మయ్య బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఇబ్రహీం ఖాన్.



ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 6: ఏలేశ్వరం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా ఎండి ఇబ్రహీం ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయునిగా అనేక సేవలందించి పదవి విరమణ పొందిన తర్వాత ఖాన్ మాస్టారును విశ్రాంత ఉద్యోగులు రెండోసారి ఎన్నుకోవడం విశేషం. యుటిఎఫ్ అధ్యక్షునిగాను, జిల్లా కౌన్సిల్ సభ్యునిగాను అనేక సేవలు అందించిన ఖాన్ మాస్టర్ సమర్ధవంతమైన నాయకత్వం, దృఢమైన దీక్ష పట్టుదలతో సంఘం పట్ల ఆయన చేసిన కృషికి ఫలితంగా మరోసారి సమర్థవంతమైన నాయకుడు ఎన్నుకోవాలని ఖాన్ మాస్టర్ను అధ్యక్షునిగా ఎందుకు అవడం జరిగిందని పలువురు యుటిఎఫ్ సభ్యులు వ్యాఖ్యానించారు. నూతనంగా ఏర్పడిన యూటీఎఫ్ మండలం సంఘం నూతన కార్యదర్శిగా పి గంగాధర్, కోశాధికారిగా మజ్జి తాతారావు, మహిళ కార్యదర్శిగా చిల్లా రేవతి, గౌరవ అధ్యక్షునిగా బీరక విశ్వనాథం, ఉపాధ్యక్షునిగా వాస పుల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా జి జాన్ విల్సన్ బాబు ఎన్నికయ్యారు.

## తారు మిక్సర్ ప్లాంట్ల ఏర్పాటును అడ్డుకోవాలి

చొప్పెల్ల నాయకుల విజ్ఞప్తి



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 06;** తమ గ్రామంలో తారు మిక్సర్ ప్లాంట్లను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని చొప్పెల్లకు చెందిన పలువురు నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని ఎంపీడీవో రాజుకు అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు సూరపురెడ్డి సత్య మాట్లాడుతూ తమ గ్రామంలో తారు మిక్సర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం కారణంగా స్థానికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడతారని అన్నారు. స్థానికులకు ఆస్తమా వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే మిక్సర్ ప్లాంట్ నుంచి వాహనాలు రాకపోకల వల్ల గ్రామ పరిధిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పచ్చని తమ గ్రామంలో ఇటువంటి ప్లాంట్లు ఏర్పాటు సరికాదన్నారు. ఈ అంశంపై గతంలోనే కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో రాజుకు సైతం వినతిపత్రం అందించామన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ ప్లాంట్ ల ఏర్పాటు అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర వెంకన్న,ఆకుల అన్నవరం, సోము శ్రీనివాసు, పల్ల శ్రీను, తోరాటి సత్తిబాబు, కోళ్ల బాబి, నాగిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 47 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** అమలాపురం పట్టణంలో ఉన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ 47 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 వ తేదీన మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్పేయి నేతృత్వంలో పార్టీ స్థాపించబడి అంత్యోదయ స్ఫూర్తితో.. సుపరిపాలన లక్ష్యంగా.. సేవయే పరమావధిగా పార్టీ కోసం పని చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న కోట్లాది మంది భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ అనే నినాదంతో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాలు ఉపాధ్యాయ ఆశయాల బాటలో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి ప్రస్థానం కొనసాగుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ నాయకత్వంలో పార్టీ 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అవినీతి రహిత పాలనను అందిస్తూ, అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచి పార్టీని అగ్రస్థానంలో నిలిపారన్నారు. అనంతరం స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు అయ్యల భాషా, మాజీ జిల్లా అధ్యక్షులు యాళ్ళ దొరబాబు, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పనాతి దత్తాత్రేయ, జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఇల్ల సత్యనారాయణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు ఎల్లాన శకుంతల, ఎస్సీ మోర్చా



జిల్లా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాసరావు, మహిళా మోర్చా సీనియర్ నాయకులు చిట్టూరి రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి, అల్లవరం మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి, డీవీఎస్ రాజు, గోకరకొండ గంగన్న స్వామి, దాకే వెంకటరావు, గంగా రాజేంద్రకుమార్, సంసాని రత్నకుమార్, పావులూరి వెంకట్ తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయాలి



జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** ప్రజల భద్రతకే మొదటి ప్రాధాన్యత నిస్తూ ప్రమాదాలను గణనీ యంగా తగ్గించడానికి కమిటీ సభ్యులు సమన్వయంతో పాటుపడాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు కోనసీమ జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గుర్తించి స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించాలన్నారు. జాతీయ రహదారులు, గ్రామీణ రోడ్ల కలయికల వద్ద స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయాలన్నారు. అతి వేగం, డ్రంక్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ పాటింపులపై ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. గత సమావేశ మినిట్స్ పై తీసుకున్న చర్యలను సమీక్షించి గత ఏడాది కాలంలో ప్రమాదాల సంఖ్య, సంభవించిన మరణాలు ,విధించిన జరిమానాలు అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. వైద్య ఆరోగ్యశాఖ ట్రామా కేర్ సెంటర్లు ఆసుపత్రి వైద్య సేవల ద్వారా ఎంత మంది రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సేవలు అందించింది చర్చించారు. ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవ లసిన జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నివారించదగిన రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అన్ని విభాగాలు కలిసి చర్యలు తీసుకోవాలన్నారు ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యత అన్నారు రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ భద్రతను మెరుగు పరచాలన్నారు. జరిగిన ప్రతి రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి ప్రమాదాలు సంభ వించడానికి గల కారణాలను బ్లాక్ స్పాట్లను గుర్తించాలన్నారు అతి వేగం, మద్యం సేవించి డ్రైవింగ్, హెల్మెట్/సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తు న్నాయ న్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలన్నా రు. పాఠశాలలు, కాలేజీలలో రోడ్ సేఫ్టీ అవగాహన డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వ హించాలన్నారు అత్యవసర సేవల స్పందన అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, ట్రామా కేర్ సెంటర్ల లో సౌకర్యాలు, ప్రమాదం జరిగినప్పుడు తక్షణ చికిత్స అందుబాటు ఉంచాలన్నారు. రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదలకు మరమ్మ త్తులు, గుంతల పూడ్చివేత ,స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్ లు నిర్మించాలన్నారు. పోలీస్, రోడ్డు ఁ భవన శాఖ , ట్రాన్స్‌పోర్ట్ శాఖ, ఆరోగ్య శాఖల మధ్య సమన్వ యం తప్పనిసర న్నారు జిల్లా స్థాయిలో రహదారి ప్రమాదాలను తగ్గించడానికి, ప్రయాణీకుల భద్రతను మెరుగు పరచడానికి నిర్వహించే అత్యంత కీలకమైన సమా వేశమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్యం అందే లలా చూడటం. ప్రమాదం జరిగిన మొదటి (గోల్డెన్ అవర్) గంటలోపు బాధి తుడిని ఆసుపత్రికి చేర్చడం. హైవేల వెంట అంబులెన్స్‌ల అందు బాటును పర్యవేక్షించడం. ట్రామా కేర్ కేంద్ర ఆసుపత్రులలో అత్యవసర వైద్య సేవలు అందాలన్నారు. జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు అదేవిధంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల తాకిడి పెరగడంతో రావులపాలెం జంక్షన్ కు జనాభా తాకిడి పెరిగిందని జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సర్వీసు రోడ్లు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, జాతీయ రహదా రులు విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ బి కృష్ణమూర్తి జిల్లా రవాణా అధికారి డి శ్రీనివా సరావు జాతీయ రహదా రులు ఏఈ వెంకటరమణ ఆర్ అండ్ బి ఎస్ ఈ బి రాము, డి సి హెచ్ ఎస్ కార్తీక్, డి ఎం ఎం హెచ్ ఓ దుర్గారావు దొర, డిపిఓ శాంతిలక్ష్మి మున్సిపల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏలేశ్వరం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 6:** ఏలేశ్వరం మండలంలో నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఏవి రాజేష్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని సిరిపురం, పేరవరం, భద్ర వరం, లింగంపర్తి గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు అన్నారు. మండల అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహ మూర్తి అధ్యక్షతన జరుగు కార్యక్రమాల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభిస్తారని ఎం ఏ ఓ రాజేష్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు ఆయా గ్రామాల లో దాన్ని కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి రైతులు హాజరు కావాలని ఎంఏవో ఒక ప్రకటనలో కోరారు.

## మండలంలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం




**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 6:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండలంలోని వాకలగరువు, పుల్లేటికుర్రు గ్రామాలలో మండలశాఖ అధ్యక్షులు కురస ఆంజనేయులు అధ్యక్షతన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్య అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్, జిల్లా కార్యదర్శులు దంతులూరి రమ వర్మ,, మోకా ఆదిలక్ష్మి పాల్గొని జెండా ఆవిష్కరణ చేసారు. సీనియర్ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, అయ్యగారి కృష్ణ సుందర్, కముజు శ్రీను, గోనెమడతల కనకరాజు రాగిరెడ్డి సాయిరాం, అడపా రత్నం గుత్తుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

## నీటి భద్రత ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

-ప్రత్తిపాడు ఎంపీడీఓ,ఎం.వి ఆర్.కుమార్ బాబు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ 06:** నీటి భద్రత ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రత్తిపాడు ఎంపీడీఓ,ఎం. వి ఆర్. కుమార్ బాబు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాలతో మండలంలోని చిన్నశంకర్లపూడి గ్రామంలో నీటి సంరక్షణ సాగు నీటి సంఘాల భాద్యత అనే 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కుడుముల చెరువు వద్ద కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చెరువుని పరిశీలించి నీటి సంరక్షణ ఎలా చేయాలనే విషయంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ,ఎం.వి.ఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ నీటి భద్రతపై గ్రామ కమిటీల సహకారంతో పది రోజుల్లో అవసరమైన పనులను గుర్తించి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభారాజా ఆదేశాలతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత, జె ఇ,లు సుబ్బలక్ష్మి, శేషగిరి, ఏపీఓ కుమారస్వామి, గ్రామ ప్రత్యేక అధికారి,సిడిపిఓ, పద్మావతి,పంచాయతీ కార్యదర్శి,కార్యకర్తలు,చెరువు ప్రెసిడెంట్ తోపాటు పలువురు రైతులు, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఇళ్ల అప్పారావు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# CSK ఫ్యాన్స్‌కి కిర్రాక్ న్యూస్.. ధోనీ, బ్రెవిస్ రీఎంట్రీకి డేట్ ఫిక్స్.. వచ్చేది ఆ రోజే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆరంభంలోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన జట్టు వరుసగా 3 మ్యాచ్‌ల్లో ఘోర ఓటమిని చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్స్ తో జరిగిన హైవోల్టేజ్ పోరులో చెన్నై ఘోరంగా ఓడిపోయింది. మైదానంలో మహేంద్ర సింగ్ ధోనీ మార్గనిర్దేశం లేకపోవడం, వికెట్ల వెనుక అతడి చాకచక్యం లోపించడంతో జట్టు ప్రదర్శనపై తీవ్రంగా కనిపిస్తుంది. పిక్క కండరాల గాయంతో మొదటి రెండు వారాలు ధోనీ అందుబాటులో ఉండరని సీఎస్కే ఫ్రాంచైజీ ప్రకటించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అతడి రాకను త్వరలోనే ఫిక్స్ చేసే అవకాశం ఉంది.

**తలా రీఎంట్రీ:**

నిజానికి మహేంద్ర సింగ్ ధోనీ ఐదో మ్యాచ్‌లో కోల్‌కతాపై పునరాగమనం చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ జట్టు వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉండటంతో, చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏప్రిల్ 11వ తేదీన చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లోనే ఎంఎస్ ధోనీ బరిలోకి దిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా ఫిట్‌నెస్ పరీక్షను నిర్వహించబోతున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ పరీక్షలో ధోనీ నెగ్గితే, సొంత మైదానంలో అభిమానుల కేరింతల మధ్య మహేంద్రుడు మెరుపులు మెరిపించడం ఖాయంగా మారనుంది.

**ఫినిషర్‌గా ధోనీ:**

వయసు మీద పడుతున్నప్పటికీ, ఎంఎస్ ధోనీ ఫినిషింగ్ సామర్థ్యం ఏమాత్రం తగ్గలేదు.. వికెట్ కీపింగ్‌లో మెరుపు వేగంతో స్పందించడమే కాకుండా, క్లిష్ట సమయాల్లో బౌలర్లకు సరైన సలహాలు ఇవ్వడంలో అతడు కీలక పాత్ర పోషిస్తాడు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ధోనీ అనుభవం చెన్నై జట్టుకు ఎంతో అవసరం అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల ఖాతా తెరవాలని సీఎస్కే పట్టుదలతో ఉంది. ఈ కీలక పోరులో ధోనీతో పాటు మరో ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ సైతం తుది జట్టులోకి ఎంట్రీ ఇస్తాడని.. వీరిద్దరి రాకతో జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు.

# ఇకపై ఆ పప్పులు ఉడకవు.. చిన్నస్వామిలో సీన్ మారింది: బెంగళూర్ పిచ్ సీక్రెట్ బయటపెట్టిన పడిక్కల్




**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూర్‌లోని చినస్వామి స్టేడియం.. గ్రౌండ్ చిన్నగా ఉంటుంది.. ఈ స్టేడియంలో జరిగే మ్యాచుల్లో దాదాపు భారీ స్కోర్లే నమోదు అవుతుంటాయి. బ్యాటర్ల బౌండ్రీల సునామీతో అభిమానులకు కూడా కావాల్సినంత మజా దొరుకుతుంది. కానీ ఇకపై ఆ పప్పులు ఉడకవు.. వచ్చి రాగానే సిక్సులు కొడతామంటే కుదరదు.. చిన్నస్వామిలో సీన్ మారింది అంటున్నాడు ఆర్సీబీ బ్యాటర్, కర్నాటక లోయల్ బాయ్ దేవదత్ పడిక్కల్. ఆదివారం (ఏప్రిల్ 5) చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ తలపడ్డ విషయం తెలిసిందే. ఈ మ్యాచులో అతిథ్య బెంగళూర్ 43 పరుగుల తేడాతో చెన్నైను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం ఆర్సీబీ బ్యాటర్ పడిక్కల్ మాట్లాడుతూ చిన్నస్వామి పిచ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్నస్వామి పిచ్‌లో బ్యాటింగ్ తీరు మారిందని.. గతంలో మాదిరిగా తొలి బంతి నుంచే భారీ స్కోరు చేయడం ఇకపై సాధ్యం పేర్కొన్నాడు. తొలి ఓవర్లలో పిచ్ కొంచెం జిగటగా ఉంటుందని.. దీంతో మొదటి నుంచి దూకుడుగా ఆడటం ఇబ్బందికరమన్నాడు. తొలుత వికెట్లు కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని.. బంతి పాతబడే కొద్ది బ్యాటింగ్ ఈజీ అవుతుందని చెప్పాడు. 2025లో మా హోం గ్రౌండ్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత మేం ఈ విషయాన్ని గుర్తించామని తెలిపాడు. ఆ ఎదురుదెబ్బల నుంచి గుణపాఠం నేర్చుకుని.. తొలి 10 ఓవర్లలో అతిగా దూకుడుగా వెళ్లకుండా ఆడాలని నిర్ణయించుకున్నామని టీమ్ ప్లానింగ్ వివరించాడు.

చెన్నై, ఆర్సీబీ మ్యాచ్ అచ్చం పడిక్కల్ చెప్పిన మాదిరిగానే జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ పవర్ ప్లేలో అనుకున్నంతా దూకుడుగా ఆడకలేకపోయింది. విధ్వంసకర ప్లేయర్ సాల్ట్, కోహ్లీ వేగంగా రన్స్ చేయడంలో ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లేలో ఆర్సీబీ కేవలం 51 పరుగులు మాత్రమే చేయగలిగింది. కానీ ఆర్సీబీ 10 ఓవర్ల వరకు వికెట్లను కాపాడుకుంది. ఆ తర్వాత నుంచి గేర్ మార్చి ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు.

చివరి ఐదు ఓవర్లలోనే ఆర్సీబీ 97 పరుగులు చేసిందంటే ఆ జట్టు ఏ విధంగా విధ్వంసం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇక, కొండంత లక్ష్యం కండ్ల ముందు ఉండటంతో పిచ్ పరిస్థితి గురించి పట్టించుకోకుండా చెన్నై బ్యాటర్లు తొలి బంతి నుంచే బాదుడు మొదలు పెట్టారు. దీంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు నాలుగు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురై చివరకు మ్యాచ్ ఓటమి పాలైంది.

# స్నాప్‌చాట్ పోస్ట్.. అమ్మాయితో అడ్డంగా దొరికేసిన అర్ష్‌దీప్ సింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా అతడి స్నాప్‌చాట్‌లో షేర్ చేసిన కొన్ని ఫోటోలు డేటింగ్ రూమర్లకు దారి తీశాయ. ఒక మిస్టరీ గర్ల్ చేయి పట్టుకుని ఉన్న ఫోటోను షేర్ చేయడంతో, ఆ అమ్మాయి ఎవరనే దానిపై అభిమానుల్లో ఇంట్రెస్ట్ మొదలైంది. ఇక ఆ అమ్మాయి పంజాబీ నటి సమ్రీన్ కౌర్ అని నెటిజన్లు భావిస్తున్నారు. ఫోటోలో కనిపిస్తున్న అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, సమ్రీన్ కౌర్ టాటూతో సరిపోలడమే ఇందుకు ప్రధాన కారణం.. అంతేకాదు, ఇటీవల ముంబైలోని వాంఖడే స్టేడియంలో, న్యూ చండీగఢ్‌లో జరిగిన పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు ఆమె హాజరుకావడం ఈ అనుమానాలను మరింత బలపరిచింది.

సమ్రీన్ కౌర్ పంజాబీ చిత్ర పరిశ్రమలో పలు పంజాబీ మ్యూజిక్ వీడియోలు, సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా, కపిల్ దేవ్ నాయకత్వంలోని 1983 వరల్డ్ కప్ విజయం ఆధారంగా తెరకెక్కిన '83' సినిమాలో కూడా ఆమె ఒక పాత్రలో నటించారు.

**మైదానంలో అర్ష్‌దీప్:**

ఈసారి జరుగుతున్న ఐపీఎల్ లో అర్ష్‌దీప్ సింగ్‌కు అంతగా కలిసిరాలేదు. ఈ సీజన్‌లో అతడు ఇప్పటి వరకు ఒక్క వికెట్ కూడా తీయలేదు. లైన్ అండ్ లెంగ్త్ విషయంలో కాస్త ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ 27 ఏళ్ల ఈ లెఫ్ట్ హ్యాండ్ పేసర్ త్వరలోనే ఫామ్‌లోకి వచ్చి పంజాబ్ కింగ్స్ జట్టుకి తొలి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాడని టీమ్ మేనేజ్‌మెంట్, అభిమానులు ఆశిస్తున్నారు. అటు వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణం, ఇటు మైదానంలో సవాళ్లతో అర్ష్‌దీప్ ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్నారు.

# యాంగ్రీ స్టార్ ఫ్యామిలీ స్టార్ లా బిజీ అవుతారా?

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ప్రస్తానం గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాల పాటు హీరోగా ఎన్నో చిత్రాలతో మెప్పించారు. తెలుగులో తనకంటూ ప్రత్యేకమైన అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఇలా కొంత కాలం పాటు ఆయన జమానా నడించింది. హీరోగా అవకాశాలు తగ్గిన క్రమంలో? సొంత బ్యానర్లో కూడా చాలా సినిమాలు నిర్మించారు. వాటిలో కొన్ని విజయాలతో పాటు వైఫల్యాలున్నాయి. ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. నితిన్ హీరోగా నటించిన -ఎక్స్ ట్రా ఆర్డీనరీ మ్యాన్- తో సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినా? ఆ సినిమా వైఫల్యంతో రీచ్ అవ్వలేదు.తాజాగా రిలీజ్ అయిన -బైకర్- విజయం సాధించడంతో రాజశేఖర్ రోల్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది.





సొనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్

దీంతో అధికారికంగా రాజశేఖర్ సెకెండ్ ఇన్నింగ్స్ షురూ అయింది. నటనలో ఆయన చూపిన పరిణతి, గంభీరమైన ఆహార్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.రాజ శేఖర్‌కు ఉన్న ప్రత్యేకమైన వాయిస్ బేస్ , స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద హీరోల సినిమాల్లో పవర్‌ఫుల్ పాత్రలకు సరిగ్గా సరిపోతాయి. ముఖ్యంగా మాస్ సినిమాల్లో తండ్రి పాత్రలు, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్స్ లేదా ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో ఆయన కనిపిస్తే ఆ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది.ఒకప్పుడు అగ్ర హీరోగా వెలిగిన నటులు ఇలాంటి మార్పును అంగీకరించడం అంత సులభం కాదు. కానీ రాజశేఖర్ వాస్తవాన్ని గ్రహించి నటుడిగా తన ప్రయాణాన్ని కొనసాగించడానికి సిద్ధపడటం శుభపరిణామం. ఇది కేవలం ఆయనకు మాత్రమే కాకుండా, టాలీవుడ్ పరిశ్రమకు కూడా ఒక మంచి సీనియర్ నటుడు అందుబాటులోకి వచ్చిన ట్లవుతుంది. వైవిధ్యమైన పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత కలర్‌ఫుల్‌గా మార్చుకునే అవకాశం ఆయన చేతుల్లోనే ఉంది. టాలీవుడ్‌లో హీరోగా ఇమేజ్ తగ్గిన తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. -లెజెండ్- సినిమాతో విలన్‌గా మారి సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా బిజీ అయ్యారు.రాజశేఖర్ క్లిక్ అయితే జగపతి బాబుకు పోటీగానూ మారే అవకాశం ఉంది. జగపతి బాబు తరహాలోనే పరిశ్రమలో బలమైన వర్సటైల్ నటుడిగా స్థిరపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి యాంగ్రీ స్టార్ నుండి వర్సటైల్ స్టార్ గా ఆయన ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. రాజశేఖర్ కూడా ఇంత కాలం పెదవి దాటని మాటని ఈ మధ్యనే దాటించారు. మంచి పాత్రలు పోషించడానికి తానెప్పుడు ముందుటానని వెల్లడించిన నేపథ్యంలో కొత్త అవకాశాలు ఎంత మంది కల్పిస్తారో చూడాలి. ఇప్పటికే రెండు..మూడు ప్రాజెక్ట్ లు ఉన్నట్లు యాంగ్రీస్టార్ రివీల్ చేసిన సంగతి తెలిసిందే.



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965